# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-06-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.**

**2. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వైద్యం సకాలంలో అందేలా చూడాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు.**

**3. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతున్నాయి.**

**4. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా కృష్ణా, ఏలూరు జిల్లాల్లో మాదక ద్రవ్యాల నివారణపై ఈరోజు అవగాహన ర్యాలీలను చేపట్టారు.**

**5. పాలు, పాల ఉత్పత్తులకు గల ప్రాధాన్యత పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ రోజు ప్రపంచ పాల దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

==========================

రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమాన్నిరాష్ట్రవ్యాప్తంగా ఈరోజు నుంచి ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగా కాకినాడ జిల్లా పిఠాపురంలో రేషన్ పంపిణీని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ,

వాయిస్.. 30 సెకన్లు

మరోవైపు పార్వతీపురంమన్యం జిల్లా సాలూరులో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఈరోజు ప్రారంభించారు. లబ్ధిదారులు తమకు దగ్గరలో ఉన్న ఏ రేషన్ దుకాణం అయినా సరుకులను తీసుకోవచ్చని తెలిపారు. తిరుపతి పెద్దకాపువీధిలో స్థానిక శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు రేషన్ వస్తువులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

--------------------------

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వైద్యం సకాలంలో అందేలా చూడాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ప్రకాశం జిల్లా దోర్నాల మండలం చింతల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సౌకర్యాలు,

మందుల లభ్యత, పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, వైద్య సేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాలలో మందుల నిల్వను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని, ఆరోగ్య సేవల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులకు సూచించారు.

---------------------------

దేశంలోని మారుమూల ప్రాంతాలు మొదలుకొని ప్రపంచ దేశాలకు సంబందించిన రోజువారీ విశ్వసనీయమైన సమాచారాన్ని ప్రసారభారతి షబ్ద్ పోర్టల్ వార్తా కథనాల రూపంలో ఉచితంగా అందిస్తోంది. అనేక అంశాలకు సంబంధించి రోజుకి 800కి పైగా వార్తా కథనాలను 15 ప్రాంతీయ భాషల్లో షబ్ద్ పోర్టల్ ద్వారా వీక్షించవచ్చు. కాగా ఈ షబ్ద్ పోర్టల్‌లోని సమాచారాన్ని కంటెంట్ క్రియేటర్స్, యూట్యూబర్స్‌తో పాటు ఎవరైనా ఉచితంగా ఉపయోగించుకోవచ్చని ఎటువంటి కాపీరైట్స్ సమస్యలు ఉండవని ప్రసారభారతి ఒక ప్రకటనలో తెలిపింది.

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర-2025 పేరుతో నెలరోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా తూర్పుగోదావరి, ఎన్టీఆర్, విశాఖపట్నం జిల్లాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్లు, స్థానిక అధికారులు, ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు. కడపలోని రాజారెడ్డి స్టేడియంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

..వాయిస్... 26 సెకన్లు

---------------------------

"ఆక్యులర్ ట్రోమా" అని పిలిచే కంటి గాయాల కారణాలు, నివారణ చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలను జాతీయ మానవ హక్కుల కమిషన్-ఎన్ హెచ్ ఆర్ సి నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా కంటి గాయాలకు సంబంధించిన ఆరోగ్య సంరక్షణపై ప్రజలకు పలు సూచనలు చేస్తోంది. క్రీడలు, ప్రమాదకర పని సమయంలో రక్షణ కళ్ళద్దాలను తప్పనిసరిగా ఉపయోగించాలని, కంటి గాయానికి కారణమయ్యే బాణసంచా నిషేధం అమలు చేయడం వంటివి చేపట్టాలని తెలిపింది.

---------------------------

పాలు, పాల ఉత్పత్తులకు గల ప్రాధాన్యత పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ రోజు ప్రపంచ పాల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఐక్య రాజ్య సమితికి చెందిన ఆహార..., వ్యవసాయ సంస్థ ఎఫ్ ఏ ఓ, పిలుపు మేరకు ప్రతి ఏటా జూన్ ఒకటవ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. మన దైనందిన ఆహారంలో పాలు ఒక ముఖ్యమైన భాగం. పాలు మన ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా, శరీరానికి సమతుల ఆహారాన్ని అందిస్తుంది. అంతే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా పాడి పరిశ్రమ కోట్లాదిమంది ప్రజలకు జీవనోపాధి కల్పిస్తోంది. ఇంతటి ప్రాధాన్యం సంతరించుకున్న పాల ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేసేందుకే ఈరోజు పాల దినోత్సవం నిర్వహిస్తున్నారు..

---------------------------

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని మచిలీపట్నం రెవిన్యూ డివిజనల్ అధికారి– ఆర్డిఓ వాణి కోరారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అవగాహన ర్యాలీని ఈరోజు నిర్వహించారు. మచిలీపట్నం ఆర్డిఓ వాణి ఈ కార్యక్రమంలో పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మాదక ద్రవ్య వినియోగం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరిస్తూ యువతకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

---------------------------

యువత మాదకద్రవ్యాల బారినపడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఏలూరులో నిర్వహించిన 5కె వాక్ థాన్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈరోజు నుండి ఈ నెల 26వ తేదీ వరకు మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కల్పిస్తూ జిల్లాలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొంటూ,

.వాయిస్.. 30 సెకన్లు

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండురోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితి గురించి వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంటకరావు తెలుపుతూ,

వాయిస్... 23 సెకన్లు

---------------------------

రైతులు పంటల సాగులో నూతన సాంకేతికను అందిపుచ్చుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా సంయుక్త కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. ఉండి మండలం పాందువ్వ గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిన్న జిల్లా స్థాయి వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ, ఖరీఫ్ సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో పంట సాగు, ఎరువుల వాడకం, వంటి అంశాలను రైతులకు వివరించారు. కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

=====================